సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 25 । మే । 2024



నకిలీ ఫేస్‌బుక్ ఖాతా
నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచారు. - 8లో



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. - 8లో



వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 1,373 మంది హాజరు


భువనగిరిలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్‌లను పరిశీలిస్తున్న అధ్యాపకుడు

భువనగిరి : జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరిగింది. 1,496 మంది విద్యార్థులకు 1,373 మంది హాజరయ్యారు. 123 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 91.78 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ షాఫిజ్ అక్తర్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

భువనగిరి : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1.272 మంది విద్యార్థులకు గాను 1,172 మంది హాజరయ్యారు. 99 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షకు 542 మందికి 506 మంది విద్యార్థులు హాజరయ్యారు. 36 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు బంగారు పతకాలు


అనిల్‌కుమార్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బాంబ్‌స్వాక్డ్ టీంలో పని చేస్తున్న కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 22 నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పాన్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 400, 800, 3,000 మీటర్ల పరుగు పందెంలో అనిల్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను త్వరలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ వల్ల కొనుగోళ్లు కాస్త ఆలస్యం అయ్యాయని, వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎప్పటికపుడు అధికారులు, మిల్లర్లతో మాట్లాడుతూ కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.వ్యవసాయం గురించి తెలియని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. రైతుల గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పంజాల రామాంజనేయులుగౌడ్, గోలి పింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, పొట్టోల శ్యామ్‌గౌడ్, ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి, గడ్డం బాలకృష్ణ, పంజాల పెంటయ్య, మలగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగు అంచనా 4.59 లక్షల ఎకరాలు

వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- గత సంవత్సరం కంటే 1,50,482 ఎకరాలు ఎక్కువ
- ఈసారి కూడా వరి, పత్తిదే అగ్రస్థానం
- ఎరువులు, విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
- దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు


గుండాల శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు


ఆత్మకూర్(ఎం) మండలం తుక్కాపురంలో దుక్కి దున్నుతున్న రైతు

భువనగిరి : వానాకాలం సీజన్ పంటల సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఏ పంట ఎంత మేరకు సాగు కానుంది, ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు ఎంత అవసరం అవుతాయని అంచనాలు రూపొందించింది. గత సీజన్ కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఉన్నట్లు అంచనా వేశారు.

వరి వైపే మొగ్గు
జిల్లాలో ఈసారి వానాకాలం 4,59,850 ఎకరాల్లో పంటలు సాగువుతాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఎప్పటి మాదిరిగానే వరి, పత్తి అధికంగా సాగయ్యే అవకాశం ఉందని, ఆ తర్వాత పత్తి, కందులు సాగు కానున్నట్లు అధికారులు ప్రకటించిన గణాంకాల ప్రకారం తెలుస్తోంది. గత ఏడాది వానాకాలంలో 3,09,368 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాగా ఈసారి అదనంగా 1,50,482 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సీజన్ నుంచి ధాన్యానికి బోనస్‌గా రూ.500 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం, ముందస్తుగా, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఎక్కువగా వరి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వానికి నివేదిక..
సాగు ప్రణాళిక ఖరారు చేసిన అధికారులు.. అందుకు అనుగుణంగా అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల ఇండెంట్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. వరి, కందులు, నూనె గింజలు కలిపి 71,284 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అని బావిస్తున్నారు. పత్తి విత్తనాలు 270,000 ప్యాకెట్లు అవసరమని నిర్ణయించారు. వీటితో పాటు ఎరువులు 80,594 మెట్రిక్ టన్నులు కావాలని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.

ఎరువుల డిమాండ్ ఇలా..
యూరియా 35260, డీఏపీ 1,4530, ఎంవోపీ 5,812, కాంప్లెక్స్ 23248, ఎస్ఎస్‌పీ 1,744 మొత్తం 8,0594 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాల్సి ఉంది.

సాగు అంచనా ఇలా..

పంట	గత వానాకాలం	ఈ సారి	విత్తనాలు (క్వింటాళ్లలో)
వరి	3,05,691.13	2,85,000	71,012.50
పత్తి	1,02,407.30	1,35,000	2,70,000ప్యాకెట్లు
పప్పులు	3,482.39	8,500	208.27
చిరుధాన్యాలు	150.2	200	--
నూనె గింజలు	45.04	150	63.48
ఇతర పంటలు	--	21,000	--
మొత్తం	3,09,368.76	4,59,850	

నేటినుంచి రోహిణి కార్తె
సాధారణంగా రైతులు రోహిణి కార్తెలో సాగు ప్రారంభిస్తారు.ఈ కార్తెలో విత్తనాలు వేస్తే మంచి దిగుబడి వస్తుందని నమ్మకం. శనివారం నుంచి రోహిణి కార్తె మొదలు కానుండడంతో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేసే పనిలో నిమగ్నులు కానున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండడంతో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో దుక్కులు దున్ని, విత్తనాలు వేయడం ప్రారంభించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని రైతులు భూములు సాగు చేయడం, దమ్ము వేయడం వంటి పనులు చేసుకుంటున్నారు.

సాగు విస్తీర్ణం పెరగనుంది



గత వానాకాలం కంటే ఈ సారి సాగు విస్తీర్ణం పెరగనుంది. ఇప్పటికే వర్షాలు కురుస్తుండడంతో పలు చోట్ల రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశాం.
–అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సకాలంలో ఎరువులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి రూరల్ : రైతులకు ఇకనుంచి సకాలంలో ఎరువులు అందనున్నాయని కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని వేర్ హౌజింగ్ గోదాములో ఏర్పాటు చేసిన ఎరువుల ర్యాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో నాలుగున్నర లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగయ్యే అవకాశం ఉందని, 80 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయన్నారు. ఇప్పటి వరకు మిర్యాలగూడ, హైదరాబాద్‌లోని సనత్ నగర్ ర్యాక్ పాయింట్ల నుంచి ఎరువులు వచ్చేవన్నారు. ఇప్పుడు జిల్లాలోనే ర్యాక్ పాయింట్ అందుబాటులోకి వచ్చినందున, రైతులు సకాలంలో ఎరువులు పొందవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఎల్ఎన్ఎస్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, లాజిస్టిక్ రీజినల్ మేనేజర్ శేషు కుమార్, డీజీఎం వెంకటేశ్వర్లు, ఏడీఏ దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ప్రచారం బంద్

- నెల రోజులుగా హోరెత్తిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపెయిన్
- విస్తృతంగా ఆత్మీయ సమ్మేళనాలు, సన్నాహక సమావేశాలు
- హాజరైన రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు
- 27న పోలింగ్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు



సాక్షి, యాదాద్రి : వరంగల్ – ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ తుది అంకానికి చేరింది. కీలక ఘట్టమైన ప్రచారం పర్వం మరికొద్ది గంటల్లో ముగియనుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారాన్ని ముగించనున్నాయి. నెల రోజులుగా ప్రచారాన్ని హోరెత్తించిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీన జరిగే పోలింగ్‌కు సిద్ధమవుతున్నారు.

ముఖ్యనేతల ప్రచారం
అభ్యర్థుల తరఫున రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. బీజేపీ ఆత్మీయ సమ్మేళనాలకు కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితర నేతలు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం ప్రచారం చేశారు. బీఆర్ఎస్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, గాదరి కిషోర్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, మరి కొందరు నాయకులు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

ప్రచార అస్త్రంగా సోషల్ మీడియా..
గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం హోరెత్తింది. ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన రాజకీయ పార్టీలు.. సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా మలుకుంది. వాట్సప్, ఫేస్‌బుక్, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్‌రావు ఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

బరిలో 52 మంది..
బరిలో 52 మంది ఉన్నా ప్రధాన పోటీ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే జరగనుంది. బీఆర్ఎస్ నుంచి రాకేష్‌రెడ్డి, బీజేపీ తరఫున గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) బరిలో నిలిచారు. వీరంతా ఆత్మీయ సమ్మేళనాలు, సన్నాహక సమావేశాల ద్వారానే కాకుండా విద్యా సంస్థలు, కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పట్టభద్రులు, ఉద్యోగులు, వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

చివరి ప్రయత్నాలు
పోలింగ్‌కు కొద్ది గంటలే సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రతి నిమిషాన్ని విలువైనదిగా భావిస్తున్నారు. బహిరంగ ప్రచారం ముగియడంతో తాయిలాల పంపిణీపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఓ ప్రధాన పార్టీ ఓటుకు రూ. 2 వేల చొప్పున ఇచ్చేందుకు ప్లాన్ సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

ఎస్ఎంఎస్‌లు నిషేధం
సాక్షి,యాదాద్రి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే వరకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపరాదని, ఎవరైనా నియమావళి ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. బల్క్ ఎస్ఎంఎస్‌లపై 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నిషేధం ఉంటుందన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : దేశీ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) కోర్సుల్లో శిక్షణ పొందిన వ్యవసాయ డీలర్లు రైతులకు అవసరమైన సమాచారం అందజేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. వ్యవసాయం, పశుపోషణ, సెరికల్చర్, సాంకేతిక నైపుణ్యంపై దేశీ శిక్షణ పొందిన 40 మంది డీలర్లకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. సాగులో సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యమని, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి అధి దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. విత్తన, ఎరువుల వినియోగ చట్టాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏరువాక శాస్త్రవేత్త అనిల్, ఏడీఏలు ఉన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులపై సమీక్ష
పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశమై పాఠశాలల్లో జరుగుతున్న పనులను సమీక్షించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం లోగా పనులన్నీ పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో 673 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 51,848 మంది విద్యార్థుల యూనిఫామ్ కుట్టేందుకు మండల కేంద్రాలకు క్లాత్ పంపినట్లు పేర్కొన్నారు. 541 స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా యూనిఫామ్ డ్రెస్సులు కుట్టించి జూన్5వ తేదీలోగా విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

వారంలోగా కొనుగోళ్లు పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్


దేవలమ్మనాగారంలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ అనితారామచంద్రన్

చౌటుప్పల్ : ధాన్యం కొనుగోళ్లు వారం రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి శుక్రవారం చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసి కేంద్రాన్ని ఎత్తివేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం నర్సరీకి వెళ్లి మొక్కలను పరిశీలించారు. మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జూన్ 2లోపు పూర్తి కావాలని ఆదేశించారు. అక్కడి నుంచి చిన్నకొండూరు గ్రామానికి వెళ్లి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థుల యూనిఫామ్ కుట్టడం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట డీఆర్‌డీఓ కృష్ణన్, సివిల్ సప్లయ్ డీఎం గోపీకృష్ణ, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి డీసీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ సందీప్‌కుమార్, డీఎల్‌పీఓ ఉన్నారు.

ఐదు నెలల్లోనే అపఖ్యాతి


చౌటుప్పల్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

- బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా అన్నింటిలో విఫలం
- ఫ్లోరైడ్ భూతాన్ని తరిమిన ఘనత బీఆర్ఎస్‌దే
- యాదాద్రి ఆలయం వెయ్యేళ్లు చెక్కుచెదరకుండా తీర్చిదిద్దాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


సమావేశానికి హాజరైన పట్టభద్రులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

చౌటుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలు చీదరించుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఐదు నెలల్లోనే అపఖ్యాతి మూటగట్టుకుందన్నారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మునుగోడు నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా మరే హామీ కూడా అమలు కాలేదన్నారు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకుంటుండగా, మగవారు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎవ్వరు కూడా రాష్ట్రం పరువుకు భంగం కలిగించరని, రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణ అప్పుల్లో ఉందని ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్రటేరియట్‌లో లంకెబిందెలున్నాయని వస్తే ఖాళీ కుండలు ఉన్నాయని వ్యాఖ్యలు చేసిన వ్యక్తి కూడా ముఖ్యమంత్రేనా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ వల్లే తెలంగాణలో అభివృద్ధి జరిగింది : జగదీశ్‌రెడ్డి
కేసీఆర్ వల్లే తెలంగాణలో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించేందుకు మిషన్ భగీరథకు రూపకల్పన, పరిశ్రమలు తీసుకురావడం, తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మాత్రం కేటీఆరేనని పేర్కొన్నారు. పరిశ్రమల ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పించారని, సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను గట్టెక్కించేందుకు అనేక పథకాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకు తిరుగుతున్న కాంగ్రెస్ పెద్దలను గల్ల పట్టుకొని నిలదీయాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

యాదాద్రి క్షేత్రం వెయ్యేళ్లు చెక్కుచెదరకుండా ఉండేలా తీర్చిదిద్దారని, వెయ్యి గ్రామాల్లో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమివేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారిండో అందరికీ తెలుసన్నారు. రాజగోపాల్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఏ రకంగా బూతులు తిట్టుకున్నారో కూడా గుర్తుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు ఉండాలంటే ఉన్నత విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, గాదరి కిశోర్, సూర్యాపేట జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ, సీనియర్ నాయకులు మునగాల నారాయణరావు, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, మార్కెట్ మాజీచైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సుర్వి యాదయ్య, గుండెబోయిన అయోధ్య, వెంకటేశం, ఢిల్లీ మాధవరెడ్డి, ఊడుగు మల్లేష్, సుర్వి మల్లేశం, దయాకరాచారి, కృష్ణ పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం


హైదరాబాద్ నుంచి కోదాడకు వెళ్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లంబావి గ్రామం వద్ద స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

కనుల పండువగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు.సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారిని ఊరేగిస్తున్న సమయంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజలి సేవోత్సవం చేపట్టారు. అనంతరం హారతి ఇచ్చారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం అభిషేకం, అర్చనలు చేశారు. అలాగే ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయానికి ద్వారబంధనం చేశారు.

ఆండాళ్‌దేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



క్లుప్తంగా

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్ : గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం ఖమ్మం పహాడ్ గ్రామానికి చెందిన బొల్లెద్దు శ్రీకాంత్ (42) భార్య, పిల్లలను వదిలేసి మరో మహిళతో సహజీవనం చేస్తూ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో మద్యం మత్తులో గురువారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా అతడితో కలిసుంటున్న మహిళ ఆటోలో చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చింది. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై భార్య జోజిరాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాఠశాలలో వంట సామగ్రి చోరీ

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులకు అందించే పుస్తకాలను భద్రపరిచేందుకు హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలకు వచ్చారు. ఆ సమయంలో పాఠశాలలోని వంటగది తాళం పగులగొట్టబడి ఉంది. అంతేకాకుండా ఆ వంట గదిలోని సుమారు రూ.50 వేల విలువ గల వంట సామగ్రి చోరీ కావడాన్ని ఉపాధ్యాయులు గుర్తించారు. చోరీకి పాల్పడిన నిందితులు బీర్లు తాగి సీసాలను గదిలోనే పడేశారు. దీంతో చోరీ జరిగిన విషయాన్ని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు హెచ్ఎం తెలియజేశారు. పాఠశాలను పరిశీలించిన అనంతరం చిట్యాల పోలీసులకు చోరీ ఘటనపై హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. కాగా పాఠశాల గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడం, వాచ్‌మెన్ లేకపోవడం, వేసవి సెలవుల కారణంగా పాఠశాల గేటు వేసి ఉండడంతో ఇదే అదునుగా భావించి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది.

నల్లగొండ కలెక్టర్ హరిచందన పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

- ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తూ.. మెసెంజర్‌లో చాటింగ్
- మా ఫ్రెండ్ సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్ ఇల్లు అమ్ముతారంటూ చాటింగ్
- మీకు తెలిసిన వారికి అమ్మించమంటూ మెసేజ్‌లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన పేరుతో ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ ఖాతా ఓపెన్ చేశారు. ప్రొఫైల్‌లో కలెక్టర్ హరిచందన ఫొటోతోపాటు బ్యాక్‌గ్రౌండ్‌లో గతంలో ఆమె చేసిన కార్యక్రమాలతో కూడిన ఫొటోలతో హరిచందన్ ఐఏఎస్ పేరుతో ఖాతాను రూపొందించి ఓపెన్ చేశారు. దీంతో కలెక్టర్‌కు తెలిసిన వారు ఎవరైనా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తే దానికి యాక్సెప్ట్ చేసి, ఆ ఖాతాలో ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికి హరిచందన ఐఏఎస్ పేరుతో కలిగిన ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. అది నిజమని భావించిన వారు యాక్సెప్ట్ చేయడంతో అసలు కథ అప్పుడు మొదలవుతోంది. ఫేస్‌బుక్ మెసేంజర్ ద్వారా చాటింగ్ మొదలు పెడుతున్నారు. తనకు సంతోష్‌కుమార్ అనే సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్ ఫ్రెండ్ ఉన్నారని, ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయిందని, తన ఇల్లును తక్కువ ధరకు అమ్ముతున్నారంటూ చాటింగ్ మొదలు పెడుతున్నారు. మీకు తెలిసిన వారికి విక్రయించి పెట్టమని, లేదంటే మీరే తీసుకోండని మాటల్లో పెట్టి, ఫోన్‌నెంబరు తీసుకొని మరొక నంబరుతో వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తూ డబ్బులు లాగే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఇల్లు ఎలాగూ తీసుకుంటారని భావిస్తున్నానని, తాను ప్రస్తుతం మీటింగ్‌లో ఉన్నానని, అర్జంట్ అవసరం ఉందంటూ డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను వివరణ కోరగా, తనకు ఫేస్‌బుక్ ఖాతా లేదని, అది ఫేక్ అకౌంట్ అయి ఉంటుందని, ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎవరు నమ్మిమోసపోవద్దని పేర్కొన్నారు.

జూన్ 1 నుంచి సురేంద్రపురిలో ఉత్సవాలు

భువనగిరి రూరల్ : మండల పరిధిలోని వడాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద గల సురేంద్రపురిలో జూన్ 1 నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నర్సింహారావు తెలిపారు. శుక్రవారం సురేంద్రపురిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ చైర్మన్ కుందా ప్రతిభ, కంచి కామకోటి పీఠం ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 1న సువర్చల పంచముఖ హనుమాన్ కల్యాణం, హనుమాన్ మాల విరమణ, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం సురేంద్రపురి సృష్టికర్త కుందా సత్యనారాయణ విగ్రహ ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణ్ కుమార్ చార్యులు, మత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.


విశ్వరూప్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు


స్వామివారి జోడు సేవలో పాల్గొన్న ఆర్.కే.రోజా

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఏపీ మంత్రులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు విశ్వరూప్, ఆర్‌కె రోజా వేర్వేరుగా దర్శించుకున్నారు. విశ్వరూప్ తన కుటుంబ సభ్యులతో కలిసి గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. యాదాద్రీశుడు తమ ఆరాధ్య దైవమని, ఆ స్వామి వారి అనుగ్రహంతోనే ఈ స్థాయిలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, మరో మంత్రి ఆర్‌కె రోజా స్వామివారి జోడు సేవలో పాల్గొన్నారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రోజాకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. అంతకు ముందు ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మల్లన్న గెలుపులో యువజన కాంగ్రెస్ పాత్ర కీలకం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం యువజన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శివసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న గెలిస్తే ఆ క్రెడిట్ యువజన కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌సింగ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా రాకేష్, ఎండీ గౌస్, జిల్లా ఉపాధ్యక్షుడు జయంత్‌రెడ్డి, నల్లగొండ, సాగర్ మిర్యాలగూడ ,దేవరకొండ , నకిరేకల్ నియోజకవర్గాల అధ్యక్షులు జహంగీర్‌బాబా, పగడాల నాగరాజు, ఆజర్, హరికృష్ణ, జలంధర్‌రెడ్డి, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కనగల్ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. 20మంది ఉపాధి కూలీలకు గాయాలు

అర్వపల్లి: ఉపాధి హామీ పథకం పనులకు కూలీలను తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడి 20 మంది వరకు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూలీలు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలను ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా శుభ్రం చేయడానికి శుక్రవారం ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కాలువ కట్టపై గుంత వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు కోడెబోయిన భాగ్యమ్మ, కోడెబోయిన రామనర్సమ్మ, గుడిపల్లి అరుణ, వేములకొండ రామనర్సమ్మ, ఎరగాని వెంకటమ్మ, వేములకొండ నాగమ్మ, పేరెల్లి లక్ష్మీనర్సమ్మ, అంబటి యాదమ్మ, ఇందుర్తి కమలమ్మ, చామకూరి పద్మ, చామకూరి లింగమ్మ, బొల్లం రాంబాయమ్మ, మద్ది ప్రమీల, ఇందుర్తి రంగనాయకమ్మ, జానమ్మ, కవిత, సైదమ్మతో పాటు మరికొందరు గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్, మరో వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారికి డాక్టర్లు వైద్యచికిత్స చేయగా సాయంత్రం ఇళ్లకు చేరుకున్నారు.

ఫ్లోరోసిస్ బాధితురాలి కోరిక నెరవేర్చిన ఐఏఎస్


సువర్ణ గీసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ బొమ్మ

కోదాడరూరల్ : ఫ్లోరోసిస్ బాధితురాలు సువర్ణ గీసిన బొమ్మ తనకు చేరాలని చివరి కోరికను నెరవేర్చారు ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్. మర్రిగూడ మండలంసాయిబండతండాకు చెందిన సువర్ణ.. ఇందిరాగాంధీ, ప్రధాని మోదీ, కేసీఆర్, రాహుల్‌గాంధీ, ఆనంద్‌మహింద్రా వంటి అనేక మంది ప్రముఖుల చిత్రాలను గీసింది. ఆమె ప్రతిభను చూసి ఎన్ఆర్ఐ సుధీర్ ఆమెకు శిక్షణ ఇప్పించాడు. వాటిని వేలం వేయగా రూ.5లక్షల బహుమతులు కూడా వచ్చాయి. అయితే సువర్ణ గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె గీసిన స్మితాసబర్వాల్, పీవీ సింధు చిత్రాలను వారికి అందజేయాలని చనిపోయే ముందు చెప్పింది. ఆ విషయాన్ని జలగం సుధీర్ ట్వీట్ చేయగా స్పందించిన స్మితాసబర్వాల్ కోదాడలో ఉన్న చిత్రపటాన్ని తెప్పించుకొని తన కార్యాలయంలో పెట్టుకుందని సుధీర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పటిక, బెల్లం పట్టివేత

కోదాడరూరల్ : ఏపీ నుంచి అక్రమంగా తెలంగాణలోకి తరలిస్తున్న నల్లబెల్లంతోపాటు పటికను కోదాడ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ నుంచి తెలంగాణలోకి నిషేధిత నల్లబెల్లం, పటికను రాష్ట్రంలోకి కోదాడ మీదుగా వస్తుందనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ఖమ్మం క్రాస్‌రోడ్‌లో శుక్రవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి ఖమ్మం వైపు ఇద్దరు వ్యక్తులతో వస్తున్న బొలేరోను ఆపి తనిఖీ చేయగా అందులో 100 కేజీల నల్లబెల్లం, 600 కేజీల పటిక పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలంలోని చనుపల్లి వద్ద ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బెల్లం, పటిక, బొలేరో, ద్విచక్రవాహనాన్ని సీజ్ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ : ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన హుజూర్‌నగర్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని మాగ్దుమ్‌నగర్‌కు చెందిన జడ నాగయ్య (45) ట్రాక్టర్‌తో స్థానిక పోతిరేని కుంట చెరువు నుంచి తన వ్యవసాయ పొలానికి మట్టి తోలుతున్నాడు. ఈ క్రమంలో మేరిగ గురవయ్య పొలం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నాగయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగయ్య చిన్న కుమారుడు జడ భానుప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


శ్రీను (ఫైల్)

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దవూర మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పెరిక శ్రీను, చిలుముల కనకయ్య ఇరువురు కలిసి శుక్రవారం ఉదయం తమ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై దేవరకొండలో ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి ఉట్లపల్లికి వెళ్లే క్రమంలో కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద కొండమల్లేపల్లి నుంచి అంగడిపేటకు వెళ్తున్న ఎలిమినేటి అనిల్ అనే యువకుడు వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో పెరిక శ్రీను తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కనకయ్యకు గాయాలయ్యాయి. అనిల్‌కు సాధారణ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అశ్విని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు అప్పగింత

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును కొండపైన విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ పోలీసులు గుర్తించి అప్పగించారు. భక్తులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ తన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడి దర్శనానికి శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో వచ్చాడు. స్వామివారిని దర్శించుకుని బయటకు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులతో కలిసి నిఖిల్ ఉత్తర మాడ వీధిలో కూర్చున్నాడు. ఈ సమయంలో నిఖిల్ తన మెడలో ఉన్న సుమారు తులం బంగారం గొలుసు ఎక్కడో పడిపోయిందని గుర్తించాడు. 3 గంటల సమయం వరకు బంగారు గొలుసు కోసం వెతికి కొండ కిందకు వెళ్లిపోయాడు. తిరిగి నిఖిల్ మరోసారి గొలుసు వెతికేందుకు వచ్చాడు. ఈ క్రమంలో ఎస్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ కె.సోమేష్‌కుమార్‌గౌడ్ బంగారు గొలుసును గుర్తించారు. వివరాలు తెలుసుకున్న అనంతరం బంగారు గొలుసును భక్తుడికి అప్పగించారు.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి
- ఈ నెల 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 27న జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యత క్రమంలోనే ఓటు..

- ప్రతి ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయవచ్చు.
- కేవలం అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యత క్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యత క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

కేవలం ఒక్కరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే అతడికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషాల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటు గుర్తు పెట్టకూడదు.

ఓటు వేసే విధానం..

- ప్రతి అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

సొంత పెన్నుతో ఓటు వేయవద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయరాదు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు మురిగిపోతుంది.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చిన ఆ ఓటు చెల్లుబాటు కాదు.

రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ లింగయ్య

త్రిపురారం : రైతులు తమకు కావాల్సిన విత్తనాలను తమ పొలంలోనే తయారు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య సూచించారు. శుక్రవారం త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్‌లో వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వరి విత్తన మేళా నిర్వహించారు. యాదాద్రిభువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని రైతులకు వరి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడి ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, ఉమ్మడి జిల్లాలోని రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదు

నకిరేకల్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు, డ్రైవర్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో సదరు డ్రైవర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బస్సును నిలిపి గొడవ చేసిన ప్రయాణికులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి డిపో ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు బయలుదేరింది. హైదరాబాద్‌లోనే మహిళా ప్రయాణికులతో బస్సు నిండిపోయింది. మార్గమధ్యలో నకిరేకల్‌కు చేరుకున్నాక బస్సులోనుంచి కొంత మంది ప్రయాణికులు దిగిపోయారు. అందులో నలుగురు మహిళా ప్రయాణికులు బస్సును కొద్ది సేపు ఆపండి.. తమ బంధువులు వస్తున్నారని డ్రైవర్‌ను కోరారు. కొద్దిసేపు బస్సు ఆపినప్పటికీ వారు రాకపోవడంతో డ్రైవర్ బస్సును కదిలించడంతో డ్రైవర్‌తో మహిళా ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. డ్రైవర్‌కు ప్రయాణికులకు మధ్య గొడవ ముదరడంతో సదరు డ్రైవర్ బస్సును పోలీస్ స్టేషన్ దగ్గరకు తీసుకెళ్లి నిలిపివేశారు. విధి నిర్వహణకు ప్రయాణికులు ఆటంకం కలిగించారని ప్రయాణికులపై పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేశారు. అనంతరం డ్రైవర్‌కు, ప్రయాణికులకు పోలీసులు సర్దిచెప్పి పంపించడంతో సమస్య సద్దుమనిగింది.

యాత్రికులను మోసం చేసిన ట్రావెల్స్ యాజమాన్యం

- యాత్ర ముగియకుండానే బస్సును వదిలేసి పరారైన డ్రైవర్
- పోలీసుల సాయంతో స్వగ్రామానికి చేరుకున్న యాత్రికులు

రామగిరి(నల్లగొండ): విహార యాత్రకు వెళ్లిన ప్రయాణికులను ట్రావెల్స్ యాజమాన్యం మోసం చేసిన ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన 70 మంది కలిసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సుల్లో ఒక్కో బస్సులో 35 మంది చొప్పున ఈ నెల 16వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాలను చూసుకుంటూ గోవా వెళ్లి వచ్చేవిధంగా ఒప్పదం చేసుకొని బయలుదేరారు. కాగా వారి ఒప్పందం ప్రకారం కాకుండా ఒకరోజు ముందుగానే యాత్రికులు నిద్రిస్తున్న సమయంలో డ్రైవర్ బస్సును హైదరాబాద్ మీదుగా వారి స్వగ్రామానికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. గమనించిన యాత్రికులు ఎక్కడికి వెళ్తున్నావంటూ డ్రైవర్‌ను నిలదీశారు. మీ యాత్ర ముగిసింది.. ఇంతకు మించి ఇతర ప్రాంతానికి తీసుకెళ్లడం కుదరదు, మీరు ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వడం కుదరదని చెప్పడంతో డ్రైవర్‌తో వారు వాగ్వాదానికి దిగారు. దీంతో సదరు బస్సు డ్రైవర్లు ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా సమీపంలోని జడ్చర్ల వద్ద గురువారం అర్ధరాత్రి బస్సును వదిలి వెళ్లిపోయారు. ప్రయాణికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఏర్పాటు చేసిన డ్రైవర్ సహకారంతో బస్సులో స్వగ్రామం మామిడాలకు చేరుకున్న యాత్రికులు ట్రావెల్స్ యాజమాన్యంపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

భువనగిరి క్రైమ్ : మండలంలోని పచ్చర్లబోడ్ తండాలో లింగును హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఏసీపీ రవికిరణ్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. పచ్చర్లబోడ్ తండాకు చెందిన లింగుకి, దేవిసింగ్‌కు మధ్య పాత కక్షలు ఉన్నాయి. కాగా గతంలో లింగుపై హత్య, దోపిడీ, దొంగతనం కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో లింగు తనను చంపుతాడనే అనుమానంతో జనవరి 11న లింగుని దేవిసింగ్ తన కోళ్లఫారంలోకి పిలిచి మద్యం తాపించి మైకంలో ఉన్న లింగు మెడపై కత్తితో నరికాడు. లింగు తిరగబడితే దాడిచేయడానికి పానుగోతు నరేష్‌ను గడ్డివాము చాటుకు కాపలాగా ఉంచాడు. దేవిసింగ్ రెండుసార్లు కత్తితో నరకడంతో లింగు చనిపోయాడు. అనంతరం శవాన్ని ప్లాస్టిక్ నల్ల పట్టాలో చుట్టి తాడుతో బిగించారు. రక్తం కనిపించకుండా చెరిపేశారు. దేవిసింగ్, నరేష్ ఇద్దరు కలిసి హీరో యాక్టివా వాహనంపై లింగు శవాన్ని వేసుకుని కిలో మీటర్ దూరంలో ఉన్న మూసీ కాలువలో వేశారు. లింగు సెల్‌ఫోన్ తీసుకుని ఉప్పల్ వద్ద చెరువులో పడవేశారు. అనంతరం తండాకు చేరుకున్నారు. పోలీసులు అనుమానంతో ప్రశ్నించగా నిందితులు హత్య చేశామని ఒప్పుకున్నారు. శవాన్ని పడేసిన ప్రదేశాన్ని చూపించారు. కాగా శవం పూర్తిగా కుళ్లిపోయి ఉన్నది. పంచనామా నిర్వహించిన అనంతరం గ్రామంలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.